www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం జులై 30 2024
5
చిత్తూరు

పోలీసు మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వీధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని జిల్లా ఎస్పీ మణికంఠ తెలిపారు. ఈనెల 26వ తేదీ జూలై 2004లో అనారోగ్యంతో మృతి చెందిన పాలసముద్రం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జయ ప్రకాష్ సతీమణి రెడ్డిరాధాకు పోలీస్ వెల్ఫేర్ పంట నుండి లక్ష రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి భరోసా ఇస్తూ పోలీస్ డిపార్టుమెంటు తరపున వారి కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

వెదురు కష్టాలు

- ప్లాస్టిక్ వినియోగంతో తగ్గిన వాడకం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- పల్లెల్లో తగ్గిన వెదురు సాగు
- ఆదుకోవాలంటున్న కుటుంబాలు

వెదురు మానవులకు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. ఇళ్ళు కట్టుకొనడానికి, నిచ్చెనలు, బల్లలు, కుర్చీలు, బుట్టలు, తట్టలు, చాటలు వంటి ఉపకరణాలకు విశేషంగా వినియోగిస్తున్నారు. కాగితం తయారీలో గుజ్జును తయారు చేయడానికి వెదురు వాడతారు. కొన్ని అడవి జాతులు వెదురు చిగుళ్ళను ఊరగాయగా పెట్టుకొంటారు. అటవీ తెగలు వెదురు గింజలతో కల్లు, సారాయిని కూడా తయారు చేస్తారు. ఒక రంగు మినహా గోధుమలను పోలి ఉండే వెదురు గింజలను దంచి పైపొట్టు తీసి రొట్టెలను సైతం తయారు చేస్తారు.

ప్రజాశక్తి- పుంగనూరు

పుంగనూరు పట్టణంలో షెడ్యూల్ ట్రైబుకు చెందిన కుటుంబాలు వెదురుతో రకరకాల వస్తువులను తయారు చేసి అమ్మి వచ్చిన ఆదాయంతో కుటుంబపోషణ చేస్తుండేవారు. గత 40 ఏళ్లుగా ఈ కుటుంబాలు వెదురును గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు చేసి పట్టణంలో వివిధ రకాల బుట్టలు, తట్టలు లాంటివి తయారుచేసి అమ్మకాలు చేసి జీవనం సాగిస్తుండేవారు. గతంలో పట్టుపురుగులు పెంపకానికి అవసరమైన తట్టలు, చంద్రింకలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వాడేవారు. అయితే కొన్నేళ్లుగా ప్లాస్టిక్‌తో బెడ్ సిస్టం రావడం కొనుగోలు తగ్గిపోయింది. అంతేకాకుండా టమోటా మార్కెట్లకు తడికలు తయారుచేసి సరఫరా చేసేవారు. నోములు పండగ వచ్చిందంటే చాటలు తయారుచేసి బెంగళూరు లాంటి మహానగరాలకు తీసుకెళ్లి ఒక వారం రోజులకు ఇద్దరు కలిసి వెళితే రూ.40 నుంచి 50వేలు సంపాదించే వాళ్ళని వెదురు వ్యాపారులు చెప్పారు. అయితే అదే గత మూడు రెండు సంవత్సరాల్లో ఆ వ్యాపారం కూడా పూర్తిగా తగ్గిపోయిందని బెంగళూరుకి తీసుకెళ్తే ఎక్కువ అమ్మకాలు లేక రవాణా ఛార్జీలు మనుషులు వెళ్లేందుకు కూలీలు కూడా రావడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే

వ్యాపారాన్ని కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నామని వ్యాపారాలు తగ్గడంతో తమ బతుకు జీవనం కూడా కష్టమవుతుందని చెప్పారు. ప్రభుత్వం షెడ్యూల్ ట్రైబ్ కులానికి వెదురు వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవాలని కోరారు.

ఇళ్ళ నిరాణంలో..

వెదురు పురాణకాలం నుంచీ మానవునికి అత్యంత చేరువగా ఉంటూ ఎన్నో విధాలుగా ఉపయోగం పడుతోంది. దీనిని ఎక్కువగా ఇళ్ళ నిర్మాణాల్లో వినియోగించుకుంటారు. నేటికీ అనేక పల్లెల్లో, పట్టణాలలో వెదురుతో నిర్మించిన ఇళ్ళు మనం చూస్తూనే ఉంటాం. అంతే కాకుండా గృహసామగ్రిగా ఉపయోగించుకునే, నిచ్చెనలు, బల్లలు, బట్టలు ఆరవేసుకునే దండాలు, వీటి నారతో తయారు చేసిన బుట్టలు, చాటలు నిత్యావసరాలనే చెప్పవచ్చు.

అలంకరణ సామగ్రిగా..

ఈరోజుల్లో వెదురుతో చేస్తున్న ఇంటీరియల్ ఆర్ట్ పీసులు అందరి ఇళ్ళలోనూ ఎంతో శోభని చేకూరుస్తున్నాయి. బెడ్ లాంప్‌లు, చేతి బ్యాగులు, అనేక రకాల ఫోటో ఫ్రేములు, పూల సజ్జలు, వాల్ హేంగర్లు మొదలైనవే కాక, పుస్తకాల రేకలు, బట్టల బుట్టలు, వెదురు కుర్చీలు, ఉయ్యాల బల్లలు, ఫెన్సింగులు లాంటివి ఎంతో డిమాండ్ కలిగి ఉన్నాయి. జపనీయులు, చైనీయులు, వెదురుతో చేసిన గృహాలకీ, వస్తువులకీ ఎంతో ప్రాధాన్యతనిస్తారు. వెదురులో అత్యంత విశేషం మరొకటి ఏమిటంటే దీని పుష్పాలు 60 సంవత్సరాలకి ఒక్కమారు పూస్తాయి. అటువంటప్పుడు ఈ పుష్పాల నుంచి వచ్చే విత్తనాలు శాస్త్రజ్ఞులు సేకరించి జాగ్రత్త చేస్తారు. ఇక ఒక్కమాటలో వెదురు ప్రాశస్త్యం చెప్పాలంటే, పుట్టినప్పుడు ఉయ్యాల దగ్గరనుంచి, మరణానంతరం ఏడు కట్ల సవారీగా మనిషి జీవిత కాలం అంతా మనతోనే ఉంటుంది.

మా వ్యాపారం పూర్తిగా పడిపోయింది
- కేశవులు (వెదురు వ్యాపారి)

నేను పుంగనూరు పట్టణంలో 35 సంవత్సరాలుగా వెదురు వ్యాపారం చేస్తున్నాను. మొదటిలో వ్యాపారం బాగా జరిగేది. రానురాను పూర్తిగా వ్యాపారం పడిపోయింది. పట్టుపురుగుకు ఉపయోగపడే తట్టలు, చంద్రికలు, తడికలు నిచ్చన్లు, తట్టలు, బుట్టలు, చాటలు పూర్తిగా ప్లాస్టిక్ మైమయిపోయింది. ఇదే వ్యాపారం నమ్ముకొని ఇన్ని సంవత్సరాలు జీవనం సాగించాం. ఇప్పుడు ఎలా బతకాలని అర్థం కావడం లేదన్నారు. కూలి పనికి వెళ్లి కష్టపడలేక, వేరే పని తెలియక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వెదురు వ్యాపారంపై జీవనం చేస్తున్న వారిని ఆదుకోవాలి.

జవాబు దారీగా వ్యవహరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్)లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని నూతన భవనం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్)లో నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లతో జిల్లాలోని నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ అర్జీదారుల సమస్య గురించి క్షుణ్ణంగా తెలుసుకొని సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడడంతో పాటు అర్జీదారుని ద్వారా మాట్లాడించి చర్యలు తీసుకొనేలా చేస్తూ జిల్లా యంత్రాంగంను పూర్తిగా ఈ పనిలో నిమగ్నం చూస్తూ అధికారులకు తగు దిశా నిర్దేశం చేస్తున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి సోమవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీ శాఖ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరవడం జరుగుతుందని, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను కంప్యూటరైజ్ చేసి, సంబంధించిన శాఖ డివిజనల్ స్థాయి అధికారికి, మండల స్థాయి అధికారికి పంపిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాల్లో దాదాపుగా 130 నుంచి 150 అర్జీలు వస్తున్నాయని, వచ్చిన సమస్యలకు పరిష్కారాలు అందిస్తున్నామని, సమస్యలు పరిష్కరించేందుకు వివిధ రకాల బృందాలను ఇది వరకే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ, మండలస్థాయి నుంచి పరిష్కారం అందకపోతే జిల్లా స్థాయిలో జరిగే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమంలో పరిష్కారం అందుతుందని, గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం అందని ధరఖాస్తులపై ప్రతీ గురువారం, శనివారం సమీక్ష చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాస్థాయి వరకు అర్జీల పరిష్కారం కొరకు వచ్చే అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, డ్వామా పీడీ లు, సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి సత్వరమే స్పందించేలా ఆదేశాలిస్తున్నారు..

ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉంటాయి.. రెవెన్యూ శాఖకు సంబంధించి 90, పోలీసుశాఖ 3, డిఎస్ఓ 1, డిఆర్‌డిఎ 2, చిత్తూరు మున్సిపాలిటీ 1, పుంగనూరు మున్సిపాలిటీ 1,

ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

డిఎల్ఎస్ఏ 1, డిఎస్ఎల్ఓ 7, కార్మిక శాఖ 1, డిసిఓ- ఏపిఎస్‌డబ్ల్యూ ఆర్ఐఇఎస్ 1, ప్రతిభావంతులు, హిజ్రా సంక్షేమశాఖ 1, భూగర్భ గనులశాఖ 1, డియంహెచ్ఓ (వైద్యశాఖ)1, ఎస్‌వి యూనివర్సిటీ రిజిస్టర్ 1, ఎంపిడిఓ శ్రీరంగరాజపురం 1 అర్జీలు అందాయి.

భూములు లాక్కుంటున్నారు..

కలెక్టర్‌కు దాసరాపల్లి గిరిజనుల అర్జీని

భూములు లాక్కుంటున్నారు.. రక్షణ కల్పించండి కలెక్టర్‌ను యానాదులు ఆశ్రయించారు. దాసరాపల్లి యానాది కాలనీ, తూగుండ్రం పంచాయతీ, గంగాధర్ నెల్లూరు మండలానికి చెందిన సుమారు 25 యానాది కుటుంబాలకు 1997 ఆగస్టు 15 అప్పటి ప్రభుత్వం డికెటి భూమితో పాటు పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలను అందజేసి ఉన్నారు. ముష్టిపల్లి, ఎస్ఎస్.కొండ, కోడికట్లవాండ్ల ఊరు గ్రామాలకు చెందిన కొందరు మా పై దౌర్జన్యం చేస్తూ మమ్మల్ని భయాందోళన చేస్తూ మాకు అందజేసిన పట్టాదారు పాసుపుస్తకాలను లాక్కుంటున్నారు. ఇది అన్యాయమని అడుగుతుంటే రౌడీలతో మమ్మల్ని కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు.. పైగా మీరు ఎవరికి చెప్పుతారో చెప్పుకోండిని బెదిరిస్తున్నారు.. మాట వినకపోతే పెట్రోల్ పోసి చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు.. గతంలో కూడా చాలా సార్లు ఈ సమస్యపై అర్జీలను కలెక్టర్‌కి అందజేయడం జరిగింది. ఇకనైనా తమరు స్పందించి పేద గిరిజనలకు తగిన న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వేడుకున్నారు యానాదులు. కలెక్టర్ స్పందిస్తూ మీ సమస్యను పరిశీలించి మీకు న్యాయం చేస్తామని యానాదులకు హామీ ఇచ్చారు.

31న ప్రజా ఫిర్యాదుల వేదిక: కలెక్టర్

ప్రజాశక్తి- కుప్పంటౌన్:

కుప్పం పట్టణంలో ఈనెల 31వ తేదీ బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాఫిర్యాదుల వేదికను నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ పకడ్బందీగా అమలు

'ఆడ పిల్లలను కాపాడుకుందాం'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ -1994ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ -1994 అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ,పురుష నిష్పత్తిలో జిల్లాలో చాలా వ్యత్యాసం ఉందని, స్త్రీ పురుషులు ఇరువురు సమానమేనని, లింగ వివక్ష ఉండరాదని, ఆడ పిల్లలను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరి పైనా ఉందన్నారు. గర్భిణీని స్కానింగ్ సమయంలో పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలుసుకుని గర్భస్రావం చేయించడం చాలా విచారించదగ్గ విషయమన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమనే అంశాన్ని, ఆడపిల్లల ఆవశ్యకతను, బాల్యవివాహాలు జరగడం వలన కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో ఆశా, అంగన్ వాడీ, ఏఎన్ఎంలు తెలియజేయాలని తెలిపారు. జిల్లా కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండి లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పోలీస్, డ్రగ్ కంట్రోల్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు. పిసి అండ్ పి అండ్ డిటి చట్టం అమలుపై డివిజన్ల స్థాయిలో సమావేశాలను నిర్వహించాలన్నారు. డిఎం అండ్ హెచ్ఓ చిత్తూరు డివిజన్, డిఐఓ పలమనేరు డివిజన్, అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ కుప్పం, నగరి డివిజన్‌లలోని అన్ని పిహెచ్‌సిలను, అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలను పరిశీలించి చట్టం అమలుపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబి అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డిపిఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ చంద్రమ్మ, డ్రగ్ ఇన్స్పెక్టర్ కీర్తన, ఐసిడిఎస్ పిడి శైలజ, దిశ ఎస్ఐ నాగసౌజన్య, ఇతర శాఖాధికారులు, ఎన్‌జిఓలు పాల్గొన్నారు.

హెపటైటిస్ లేని సమాజ స్థాపనే లక్ష్యం: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 2030 నాటికి హెపటైటిస్ లేని సమాజస్థాపనే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని నూతన సమావేశపు మందిరంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా బ్యానర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ హెపటైటిస్ (కాలేయ) చాలా ప్రమాదకరమైన కాలేయ సంబంధిత వైరల్ అంటు వ్యాధి అని, ఇది ఐదు రకాలుగా (ఏ,బి,సి,డి,ఈ) చెప్పుకునే హెపటైటిస్ వ్యాధి, శుభ్రతలేని ఆహారం, నీటి వల్ల, కలుషితమైన రక్తం ద్వారా వ్యాధి ఇతరులకు సోకుతుందన్నారు. వీటిలో కొన్ని మందులతో నివారించబడతాయని, నిర్మూలన దిశగా ఉచిత రక్తపరీక్షల ద్వారా నిర్ధారించుకొని చికిత్స పొంది 2030 నాటికి హెపటైటిస్ వ్యాధి రహిత సమాజానికి అందరూ సహకరించాలని కోరారు. వ్యాధి నియంత్రణలో భాగంగా శిశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో హెపటైటిస్ బి వాక్సిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈవ్యాధి భారిన పడకుండా తగు సూచనలను ప్రజలు తప్పక పాటించాలని తద్వారా 2030 నాటికి హెపటైటిస్ లేని సమాజ స్థాపన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, ఎన్‌టిఆర్ వైద్యసేవ కో ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ సొమ్ముల లెక్క తేల్చాల్సిందే..

జిల్లా పరిషత్ సీఈఓకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ లెక్కలు తేల్చాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు సోమవారం జిల్లా పరిషత్ సీఈఓగ్లోరియను కలిసి వినతిపత్రం అందించారు. ఆగస్టు చివరి నాటికి సమస్యను పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని తెలియజేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జీవీ.రమణ, జిల్లా నాయకులు సోమశేఖర్ నాయుడు, మణి గండన్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేయు ఉద్యోగ ఉపాధ్యాయుల జడ్పీ పిఎఫ్ దీర్ఘకాలిక సమస్యల అపరిష్కారానికి నిరసనగా జడ్పీ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష కార్యాచరణ పోరాటం నిర్వహించుటకు ముందస్తు నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి జిల్లా పరిషత్ భవిష్య నిధి ఖాతాలను అప్డేట్ చేయాలని, 2019- 20 నుండి ఇప్పటివరకు నెలవారి చందా వివరాలను ఏ ఆర్థిక సంవత్సరానికి ఆ ఆర్థిక సంవత్సరం పూర్తిస్థాయిలో ప్రదర్శన ఉంచి అందుకు సంబంధించిన వడ్డీని జమ చేయాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టమని కోరామని, ఇందుకు సంబంధించి పురోగతి లేనందున క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు జడ్పీపిఎఫ్ ఖాతాల నిర్వహణపై తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో ఆన్లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని జడ్పీ సీఈవోకి ప్రాతినిధ్యం చేసినా కార్యాలయం నుండి ఎలాంటి పురోగతి లేనందున ఆగస్టు చివరినాటికి ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.సుధాకర్ రెడ్డి, ఎస్. రహానా బేగం, కె.రెడ్డేప్ప నాయుడు, సరిత, బాలాజీ, వంశీ కృష్ణ, సర్దార్ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

వార్డుల్లో పక్కాగా పారిశుద్ధ్యం, నీటి సరఫరా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వార్డుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, నీటి సరఫరా పక్కాగా చేపట్టాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ పలువార్డుల్లో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. 49వ వార్డు పరిధిలో తిమ్మసముద్రం, దుర్గా కాలనీ, బాబా కాలనీ, చవటపల్లి రోడ్డులో పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఉదయం 7 గంటల కల్లా రోడ్లు, వీధులు శుభ్రత పూర్తి చేయాలని, ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మేజర్, మైనర్ డ్రైనేజీల్లో పూడికతీత పనులు ఎలా జరిగిందో పరిశీలించారు. స్థానిక పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. అనంతరం నీటి సరఫరాను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని, లీకేజీలు లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం 16వ వార్డు పరిధిలో మేజర్ డ్రైన్‌ను పరిశీలించారు. దుర్గానగర్ కాలనీ చెరువులో గుర్రపు డెక్క తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేలూరు రోడ్డులో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, డీఈ వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అబాకస్‌లో సత్తా చాటిన చిన్నారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్థానిక ఒరిగిపల్లి పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఎస్.భార్గవ్ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సిప్ అబాకస్‌లో నాలుగో లెవెల్ రీజనల్ ప్రోడజీ ఛాంపియన్షిప్‌ను కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 2వ తరగతి చదువుతున్న ఎస్.దీక్షిత రాష్ట్రస్థాయి సిప్ అబాకస్‌లో మూడవ రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపల్ వైవి.కృష్ణ బాబు మాట్లాడుతూ నిరంతర అభ్యాసం, సృజనాత్మకత ఉంటే విజయం మన వెంటే ఉంటుందని తెలిపారు. సిప్ అబాకస్ నిర్వహకులకు మరియు తల్లిదండ్రులకు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన చిన్నారి దీక్షిత

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో

అలసత్వం చేయకండి: ఎస్పీ

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పిని, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్లా, దిశ డీఎస్పీ సుధాకర్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో మొత్తం 31 ఫిర్యాదులు అందాయి, అవి చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 2, ఇంటి తగాదాలు 4, డబ్బు తగాదాలు 4, భూ తగాదాలు 8, ఆస్తి తగాదాలు 7 ఉన్నాయి.

వినతులు సకాలంలో పరిష్కరించాలి: కమిషనర్

అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావినతులను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా నివేదికలు సమర్పించాలన్నారు. గత వారం అందిన వినతుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈకార్యక్రమంలో మెప్మా 5 , పట్టణ ప్రణాళిక విభాగం 2, ఇంజనీరింగ్ 2, పబ్లిక్ హెల్త్ 1 మొత్తం 10 వినతులు అందాయి. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులుగా జీవిస్తున్నారని, పనులు దొరక్క చాలా అవస్థలు పడుతున్నారని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు, యూనియన్ నేతలు సోమవారం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. జిల్లాలో ఇసుకను అందరికీ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అనేక రంగాల్లో ఉన్న కార్మికులకు కార్మికశాఖ అధికారులకు జాయింట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. చిత్తూరు జిల్లాలో ఇసుకను అక్రమంగా కొందరు బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధరించాలి శిరస్త్రాణం..

వద్దు ప్రమాదాలతో దోస్తానం

పోలీసులడుగుతారనో.. ఫైన్ నుంచి తప్పించుకొందామనో.. హెల్మెట్ తప్పక తీసుకెళ్లాల్సి వచ్చిందో ఎంటో మరి.. శిరస్త్రాణాన్ని తలకు ధరించుకోకుండా కనుమ దారిలో ఓ ద్విచక్ర వాహనదారుడు బైక్ వెనుకవైపున తగిలించి ప్రయాణిస్తున్నారు. ఈ దృశ్యం పచ్చికాపల్లం-తిరుపతి మార్గ మధ్యలోని ఎర్రగుంట కనుమ వద్ద ప్రజాశక్తి కెమెరాకు చిక్కింది. అటుగా వెళుతున్న వాహనదారులు అతని నిర్లక్ష్యం పట్ల పరివిధాలుగా చర్చించుకున్నారు. - ప్రజాశక్తి-వెదురుకుప్పం

కెసి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని కెసి ఆసుపత్రిలో అరుదైన శాస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మంజునాథ్ తెలిపారు. కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండలానికి చెందిన మహిళ తీవ్ర కడుపు నొప్పితో గత కొద్ది రోజులకు ముందు కెసి ఆసుపత్రిలో చేరినట్టు వైద్యులు తెలిపారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె కడుపులో గడ్డ ఉన్నట్టు గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్ప గుర్తించారన్నారు. ఈ గడ్డను తొలగించేందుకు డాక్టర్ బాలాజీ, డాక్టర్ స్రవంతి, రేడియాలజిస్ట్ డాక్టర్ చైతన్య కృష్ణల బృందం శస్త్ర చికిత్స చేపట్టి రోగి కడుపులోని 5.5కిలోల గడ్డను తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. చికిత్స విజయవంతం కావడంతో రోగి బంధువులు వైద్యులను అభినందించారు.

సీనియర్ సిటిజన్ డిపాజిట్లపై 8.3శాతం వడ్డీ

- డిసిసిబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: డిసిసిబీ బ్రాంచ్ బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై 8.3 శాతం వడ్డీ ఇస్తున్నట్లు డిసిసిబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్ తెలిపారు. స్థానిక బ్రాంచ్ బ్యాంకులో సోమవారం ఆయన మాట్లాడుతూ సాధారణ డిపాజిట్లపై 7.8 వడ్డీని అందిస్తున్నామన్నారు. తమ బ్రాంచ్‌లో అతి తక్కువ అద్దెతో లాకర్ వసతి ఉందన్నారు. ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, ఇతర చార్జీల భారం పూర్తిగా లేదన్నారు. బంగారం కుదవ పెట్టుకుని రుణాలు అందిస్తామన్నారు. స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాల కింద రైతులకు, వ్యాపారులకు, ఉద్యోగులకు, డ్వాక్రా సంఘాలకు, సకాలంలోనే రుణాలు ఇస్తున్నామని తెలిపారు.

'దుకాణదారులకు సెలవు లేదు'

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రతినెల ఆఖరి మంగళవారం సెలవులో భాగంగా ఈనెల 30న మంగళవారం సెలవు లేదని మర్చంట్ అసోసియేషన్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడికృత్తిక పండుగ సందర్భంగా వ్యాపారుల సౌకర్యార్థం సెలవును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని దుకాణదారులు గుర్తించాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య పరీక్షలను ఆసుపత్రి సిబ్బంది, ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యాధికారిని సోనియా, వైద్యాధికారి బాలాజీ మాట్లాడుతూ కంటి వైద్య శిబిరంలో 26మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వీరిలో కంటి ఆపరేషన్ కోసం ఐదు మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కంటి వైద్య నిపుణులు నరసింహులు, పిహెచ్ఎన్ జయలక్ష్మి, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ ఇంకెప్పుడో.?

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చెత్తబుట్టల పంపిణీ చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గత మే నెలలో మండలానికి చేరుకున్న చెత్తబుట్టలను ఇదివరకు పంపిణీ చేపట్టకపోవడం అవి మండల కార్యాలయంలో నిల్వ ఉంచారు. వాటికి వైసీపీ రంగులు ఉండడం వలన పంపిణీ చేపట్ట లేదా లేక అధికారులు నిర్లక్ష్య వైఖరి అనేది తెలియ రాకున్నది. ఇకనైనా సంబంధిత అధికారులు వీటిని పంపిణీ చేపట్టి లబ్ధిదారులకు ఉపయోగించుకునే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అంటున్నారు.

రూ.3 కోట్లతో రామగిరి ఆలయాభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: రామగిరి గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. రూ.3 కోట్లతో ఆలయ అభివృద్ధి చేపడుతామని ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పాపామని పేర్కొన్నారు. సోమవారం ఆడికృత్తిక సందర్భంగా రామగిరి సుబ్రహ్మణ్య స్వామి, వాలీశ్వర స్వామి, కాలభైరవ స్వామి ఆలయాల క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇలంగోవన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన పుణ్యక్షేత్రాల నిలయం రామగిరి అని, శ్రీ వాలీశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో ఎంతటి కరువు వచ్చినా, ఏడాది పొడవునా నందీశ్వరుని నోటి నుండి నీరు ప్రవహి స్తుందని, ఈ నీటిని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు వినియోగిస్తుంటారని ఎమ్మెల్యే వివరించారు. ఇక్కడి శ్రీ వాలీశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహి స్తారని, భారీ సంఖ్యలో భక్తులు వస్తారని ఇంతటి గొప్ప ఆలయాలకు నిలయమైన రామగిరిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి, నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నిధులు మంజూరు చేయించి ఇక్కడి ఆలయాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సుమాంజలి, ఎంపిడివో రాధ రాణి, జయచంద్ర నాయుడు,చిన్న, రజిని, మణి ఢిల్లీ బాబు,అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన: వైసిపి

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: రాష్ట్రంలో ఆటవిక, ఆరాచక పాలన కొనసాగు తోందని కూటమి ప్రభుత్వం విడుదల చేస్తున్నవి శ్వేత పత్రాలు కావని, సాకు పత్రాలు అని వైసిపి సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ అన్నారు. హామీలు అమలు చేయలేక కాలయాపన చేస్తున్నారని సీఎం చంద్రబాబుపై ఆయన ధ్వజమెత్తారు. సోమవారం రాజేష్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. కేవలం 50 రోజుల పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం, ఆటవిక పాలన అనే బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించారని విమర్శిం చారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకొచ్చిన తర్వాత అమలు చేయలేక సీఎం గత వైసిపి ప్రభుత్వంపై బురద చల్లేందుకు విడుదల చేస్తున్నవి శ్వేత పత్రాలు కావని అవన్నీ సాకుపత్రాలని తెలిపారు. పూర్తిస్థాయిలో అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా కేవలం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రజలను మభ్య పెట్టేందుకే అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని కోరారు. సత్యవేడు నియోజక వర్గంలోని కొన్ని గ్రామాల్లో వైసిపి జెండా దిమ్మె లను, శిలా ఫలకాలను ధ్వంసం చేయడం, మరికొన్ని చోట్ల అల్లర్లు సృష్టించడం బెదిరిం పులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇవన్నీ తాత్కాలికమేనని, ఎవ్వరూ భయపడాల్సిన పని లేదని, కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని రాజేష్ భరోసా ఇచ్చారు.

ఎస్వీయూలో విసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పరీక్షల విచారణ కేంద్రం, అకడమిక్ , ఫైనాన్స్ విభాగాలను ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు ఉద్యోగులతో ఫైళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలించారు. సంబంధిత విభాగ అధికారులకు సమయపాలన పాటించాలని దిశానిర్దేశం చేశారు. నిబంధనలు పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు సహక రిస్తూ, స్నేహభావంతో త్వరితగతిన పనులు చేయాలని,అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

పన్నూరులో పడకేసిన పారిశుద్ధ్యం

Ground Report

- మండలంలో అస్తవ్యస్తంగా డ్రయినేజీలు
- చెత్తాచెదారంతో నిండిపోయిన కాల్వలు
- రోజుల తరబడి నిల్వతో దుర్గంధం
- దృష్టి సారించని పాలకులు, అధికారులు
- ముందుకు కదలని మురుగు



ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని పన్నూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పన్నూరు మేజర్ పంచాయతీ ఇక్కడ సుమారు 400ఇళ్లు, 3000మంది జనాభా ఉన్నారు. ఇక్కడ మురికి కాలువలు అంతంత మాత్రమే. ఉన్న కాలువ కూడా పూడిక తీతకు నోచుకోలేదు. దీంతో ప్రజలు తమ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని కాలువలో వదులుతున్నారు. అయితే కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలో వర్షపునీరు తోడవడంతో కాలువ పొంగి మురుగునీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతోంది.

ప్రణాళికా లోపం..

మండలంలో చాలా కాలనీల్లో సీసీరోడ్డు నిర్మించినా డ్రైనేజీల గురించి పట్టించుకోలేదు. ఇక పలు కాలనీల్లో ప్రణాళిక లేకుండా డ్రైనేజీలు నిర్మించారు. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి పోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువైంది.

దుర్గంధం వెదజల్లుతోంది

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఇబ్బం దులు తప్పడం లేదు. ప్రధానంగా డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికమైంది. దీంతో రోగాలు వెంటాడుతున్నాయి. అధికారులు డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపడం లేదు. పన్నూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీల్లో పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదు. దీం తో కాలవలు పొంగి దుర్గంధం వెదజల్లుతోంది. ఇంట్లో ఉండలేని, తినలేని దుస్థితి. దోమలు ప్రజల పై దండయాత్ర చేస్తున్నాయి. అసలే సీజనల్ వ్యాధు ల ముప్పు పొంచి ఉండగా డ్రైనేజీ సమస్య తోడవడం ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

చేతిపంపు చుట్టు మురికి నీరు

చేతిపంపు చుట్టు మురికి నీరు చేరడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం చేతిపంపు వద్దకు వెళ్లితే దుర్వాసన వెదజల్లుతుంది. చేతి పంపు చుట్టూ గడ్డి పెరిగి నీరు నిల్వ చేరింది. ముక్కు ముసుకొని వెళ్లవల్సిన పరిస్తితి ఏర్పడిందని అంటున్నారు.

ఘనంగా సర్పంచ్ రాజారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సర్పంచ్ గిరి రాజారెడ్డి పుట్టిన రోజును సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులతో కలిసి రాజారెడ్డి కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. కాగా పలువురు ఆయన్ను ఘనంగా సత్కరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-సోమల: ఎన్నికల సందర్భంగా కర్నూలు నుంచి చౌడేపల్లికి బదలీపై వచ్చి ఎన్నికల అనంతరం మళ్లీ బదలీపై వెళుతుండడంతో తహశీల్దార్ శివరాముడును కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఐదు నెలల కాలంలో ఇటు సిబ్బందితోనూ, అటు ప్రజలతోనూ మమేకమై ప్రజల హృదయాలలో నిలచారని కొనియాడారు. అనంతరం అమౌంటు అందజేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్‌లు మాధవి, నాగేశ్వర్ రావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ నాయక్, సీనియర్ అసిస్టెంట్ విజయమ్మ, ఎఎస్‌వో భూపతి, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన వీడ్కోలు..

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఎన్నికల విధుల్లో భాగంగా మండలానికి విచ్చేసిన తహశీల్దార్ సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా సోమవారం తహశీల్దార్ ధోని ఆల్ఫ్రెడ్‌ను పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లోకనాథ పిల్లై, ఆర్ఐ ప్రభాకర్, నరసింహులు, తులసి, అజిత్, రవి సుబ్రహ్మణ్యం, శేఖర్, కనకరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్‌లతో మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా కోరే ప్రతి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. బంగారుపాళ్యం మండలంలో గొల్లపల్లి పంచాయతీకి సంబంధించి రెవెన్యూలో సమాచారాన్ని అడిగితే ఇవ్వకపోవడంతో ఫిర్యాది విషయాన్ని జిల్లా కలెక్టర్‌కి దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. వెనువెంటనే వారికి సమాచారం ఇవ్వాలని తహశీల్దార్ సుబ్రమ్మను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, సిడిపిఓ వాణి శ్రీదేవి, ఎంఈవో నాగేశ్వరరావు, ఏఈ గుణశేఖర్ రెడ్డి, ఏవో చిట్టిబాబు పాల్గొన్నారు.

డాక్టర్ నారాయణ రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-గంగవరం: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా గంగవరం కళామందిరంలో తెలుగు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసీనాథం నాయుడు మాట్లాడుతూ నారాయణ రెడ్డి అనేక రచనలు సినిమా పాటలు, గజల్సు వ్యాసాలు ద్వారా తెలుగు భాషా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తి అన్నారు. ఆయనకు కేంద్ర సాహిత్య పురస్కారం పద్మశ్రీ పద్మ విభూషణ్లాం ఇటి పురస్కారాలు వరించాయని, తెలుగు అధికార భాష సంఘం అధ్యక్షులుగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తెలుగు భాషకు విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పుష్ప, జాహ్నవి, రామచంద్ర, మాధవరెడ్డి, ధనంజయ, విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం చందం పంచాయతీకి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం మార్కొండ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలానికి చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం సబ్ జూనియర్స్ బాలురు, బాలికల కేటగిరీకి సంబంధించి షూటింగ్ బాల్ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులలో తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శకుంతల, జయశ్రీ, భాను తేజలు ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరు ఆగస్టు నెల 10, 11వ తేదీలలో చిత్తూరు జిల్లా వీకోట మండలంలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ, ఎఐటియూసీ, చేనేత కార్మిక సంఘాల అధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు.అనంతరం నాయకులు ఆర్‌డీవో కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు పాలక వర్గ ఎన్నికలు నిర్వహించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సిల్క్ రాయితీని రెండు వేల నుండి మూడు వేల రూపాయలకు పెంచి ఇవ్వాలని, ముద్రా రుణాలు ఇచ్చిన ప్రతిసారి సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశి , పట్టణ కార్యదర్శి కాలేషా లు మాట్లాడుతూ చేనేత వస్త్ర ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి సబ్సిడీతో వృత్తి పరికరాలను చేనేతకార్మికులకు అందించాలన్నారు. ఎంబే టిచంద్రయ్య. కార్యదర్శి నారాయణ, చేనేత కార్మిక నాయకులు భాస్కర్, కోటయ్య, యశోదమ్మ పాల్గొన్నారు.

హరోం హర

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆడికృతిక పర్వదినం సందర్భంగా జీడీ నెల్లూరులోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

సదుం: మండలంలోని గార్గేయ నది వడ్డున వెలిసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక మహోత్సవాలలో భాగంగా సోమవారం బందార్ల పల్లికి చెందిన కలికిరి భాస్కర్ రెడ్డి, అరుణమ్మ దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి స్వామివారి పూజలలో పాల్గొన్నారు.

సోమల: ఆడికృత్తిక భరణి దినోత్సవం సందర్భంగా మండలంలోని సోమల, మల్లేశ్వరపురం, కందూరు, దుర్గం కొండ ప్రాంతాలలో హరోం హర అంటూ భక్తులు కావిళ్లను మోసుకుంటూ పురవీధులలో ఊరేగారు. అనంతరం ఆలయాల వద్ద సుబ్రమణ్య స్వామికి కావిళ్లను చెల్లింపులు నిర్వహించారు. చౌడేపల్లి మండలంలో పుష్పకావిళ్లను భక్తులు మృత్యుంజయ స్వామి ఆలయంలో భక్తులు పుష్పకావిళ్లను మోసుకు వెళ్లి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

కార్వేటినగరం: మండలంలోని స్కంధపుష్కరిణీ సమీపంలోని కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని సోమవారం భక్తి శ్రద్ధలతో కావిళ్ళతో వచ్చిన భక్తులు చేసిన హరోం హర నామస్మరణాలతో కుమార గిరి హోరెత్తాయి. ఈ క్రమంలో భాగంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది మొక్కులున్న భక్తులు పసుపు వస్త్రాలు దరించి, సుగంధ భరిత పుష్పమాలికలతో కావళ్లను అలంకరించి నామస్మరణాలతో స్కంధపుష్కరిణీ వద్దకు చేరుకుని పుష్కరిణీలో పవిత్ర స్నానమాచరించిన అనంతరం కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారిని దర్శించుకున్నారు.

ఐరాల(బంగారుపాళ్యం): పాకాల మండలం ఉట్లవారిపల్లెలోని ప్రముఖ శ్రీ సుబ్రమణ్యం స్వామి ఆలయానికి ఆడికృత్తిక పర్వదినం పురస్కరించుకుని సోమవారం కాణిపాకం శ్రీ స్వయంభు శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి దేవస్థానం తరపున పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారిని సతీసమేతంగా ఎమ్మెల్యే మురళీమోహన్ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనంతరం ఆలయ అర్చక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

రాత్రైతే ఉండాలి టార్చి లైటు

పగలే వెలుగుతాది వీధి లైటు

పగలు వెలుగుతున్న వీధి లైట్లు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని వరదరాజుల కండ్రిగ వీధిలైట్లు పగటిపూట మాత్రమే వెలుగుతున్నాయి. రాత్రైతే వీధుల్లో ఒక్క లైటు కూడా వెలగడం లేదని స్థానికులంటున్నారు. రాత్రి సమయాల్లో చిమ్మచీకట్లో పిల్లలు, మహిళలు పెద్దలు సైతం బయటకు రావాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం విష సర్పాలు సంచరిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో వరదరాజుల కండ్రిగ గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిల్లో టార్చ్ లైటు ఉంటే తప్ప బయటకు రాలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. వీధి లైట్లు మరమ్మతులు చేయించి పగలు కాకుండా రాత్రిల్లో వెలుగే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

కదలని మురుగు.. వదలని కంపు

గ్రామంలో పేరుకుపోయిన మురుగు తొలగించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు ప్రబలి విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నా.. ఆ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

పాయలగుట్టలో మౌలిక వసతులు అరా.. కొరే

- పేదల గోడు విని చెమ్మగిల్లిన అధికారులు
- అసంపూర్తి ఇండ్లు పూర్తి చేయిస్తామన్న హౌసింగ్ ఏఈ
- నీరు, వీధి దీపాలు, రోడ్డు ఏర్పాటు చేస్తామన్న పంచాయతీ అధికారులు
- ప్రజాశక్తి వార్తతో కదిలిన అధికార యంత్రాంగం

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట గ్రామంలో ఏళ్ల తరబడి నెలకొని ఉన్న సమస్యలపై ప్రజాశక్తిలో సోమవారం 'పాయలగుట్ట సమస్యల తిష్ట' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికార యంత్రాంగం పరుగు పరుగున పాయల గుట్టకు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు, అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్మించిన కాలనీ ఇండ్లు గుత్తేదారు నొక్కుడు కారణంగా అసంపూర్తి నిర్మాణాలు చేయడంతో కాలనీలోని 10గృహాలు నివాసయోగ్యంగా లేకపోవడం జరిగిందని కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వర్షం వస్తే కారుతుండడంతో ఇబ్బంది పడుతున్నామని హౌసింగ్ ఏఈ జవేద్‌కు అక్కడి గ్రామస్తులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లును పరిశీలించి నూతన గృహాలు మంజూరు చేయడం, అలా కాని పక్షంలో ఉన్న ఇండ్లకే మరమ్మతులు చేయించుకొనేలా ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు చేపడతామని ఏఈ స్పష్టం చేశారు. వార్తతో స్పందించి ఆ గ్రామానికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి మేనకు అక్కడి పరిస్థితులను ఆరాదీశారు. తాగునీటి బోరులో నీళ్లు రాకపోవడానికి పరిశీలించారు. సమస్యను మహిళలు వివరించారు. దీంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని, నీటి సమస్య లేకుండా చేస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. అదేవిధంగా వీధి దీపాల ఏర్పాటుకు వెనువెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేసి సౌకర్యవంతమైన రోడ్డు ఏర్పాటు చేస్తామని ఆ గ్రామాన్ని సందర్శించిన పంచాయతీ రాజ్ ఏఈ ఆనంద్ తెలిపారు. అదే గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రెవెన్యూ అధికారులు మంగళవారం వెళ్లనున్నట్లు చెప్పారు. భూ పంపిణీ, శ్మశాన స్థలం, తాగునీటి సమస్యపై గ్రామస్తులతో మాట్లాడనున్నారు. తమ కాలనీ సమస్యపై కథనం ప్రచురించి అధికారుల్లో స్పందన తీసుకొచ్చిన ప్రజాశక్తికి పాయలగుట్ట వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

కాలనీలో సమస్యలు ఆరాదీస్తున్న అధికారులు

బైక్‌ను ఢీ కొన్న కారు

- విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కొత్తపల్లి మిట్టలో క్యాథలిక్ చర్చ్ సమీప చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని కరెంట్ లైన్ ఇన్స్పెక్టర్ గాయాల పాలైన సంఘటన మండలంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని బోడి దేవరపల్లి గ్రామానికి చెందిన శివాజీ నాయుడు విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్‌గా ఎస్ఆర్ పురం మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. విధులలో భాగంగా కొటార్లపల్లి గ్రామంలో కరెంట్ బిల్లు వసూలు కోసం వెళుతుండగా కారు ముందర వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని అదుపుతప్పి ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. శివాజీ నాయుడికి హెల్మెట్ ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు వాపోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.